# ఆదర్శం

శ్రీ సి. హెచ్. శ్రీరామమూర్తి

రామారావు ఆదర్శభావాలుగల వ్యక్తి. అతనికి సంఘసేవయందాసక్తి మెక్కువ. ఈ కోరిక అతనికి కాలేజిలో చదువు తుండగానే కలిగింది, కాని యింతవరకు అతని కవకాశం చిక్కలేదు. ఇప్పుడతను తాలూకాలో "రివిన్యూ యినస్పెక్టరు" చేస్తున్నాడు. కాలేజిలో చదివేటప్పుడు సైమంతా చదువుకుందుకే సరిపోయేది కాదు. ఇప్పుడుద్యోగ ధర్మ నిర్వహణ తోటే సరిపోతోంది రోజంతా. ఇక సంఘ సేవ చేసేదెప్పుడు? ఇదే అతనికి పెద్ద సమస్యై కూర్చుంది.

ఒకనాడేదో ఆలోచిస్తుండగా చటుక్కున అతనికి తనకాలేజిలో జరిగిన ఒక మీటింగులో అధ్యక్షుడు చెప్పిన మాటలుకొన్ని జ్ఞాపకానికొచ్చాయి. ఆ అధ్యక్షుడెవరో జ్ఞప్తికి రావటంలేదు కాని ఆయన "సంఘసేవ" గురించి చెప్పిన కొన్ని ముఖ్యమైన మాటలు మాత్రమిప్పుడు నెమరుకు రాసాగాయి...

"... సంఘ సేవ" అంటే కేవలం అస హాయులైనవారికి సహాయం చేయడం, అపాయంలోనున్న వారిని రక్షించడం, అందరికీ ఉపయోగమైన పన్లు చేయటమే కాదు. మన సంఘంలోని కుళ్లునుపోగొట్టి దానిని బాగుచేయడంకూడ సంఘసేవయే. ఉదాహరణమునకు స్త్రీ పునర్వివాహము తీసికొనండి. ఈ నిషేధమును పోగొట్టుటకు, రాజారామ్ మోహనరాయ్, వీరేశలింగంపంతులు, మొదలైన వారెంత పాటు పడిరో మీకందరకు తెలిసియే యుండును. కాని యింకను చాలమంది పూర్వాచార పరాయణులు వితంతు వివాహములన్న విముఖత చూపుచునేయున్నారు. కనుక మీలాంటి యువకులంతా కంకణంకట్టుకొని స్త్రీ పునర్వివాహములను ప్రోత్సహించవలెను........"

చదువుధ్యాసలో పడి యీ విషయాన్నే మర్చిపోయాడు. తనింకా అవివాహితుడు. ఇప్పుడెందుకా ఆదర్శాన్ని ఆచరణలో పెట్ట కూడదు? అనుకున్నాడు. గొప్పసంస్కర్త వలెనెందరినో ప్రోత్సహించి చాలమంది అభాగినుల నుద్ధరింపలేకున్నను తానొక వితంతువునైననుద్ధరింపవచ్చుననుకున్నాడు. వీరేశలింగంపంతులుగారి స్వీయకథను, వారు వ్రాసిన పుస్తకాలను చదవడం మొదలెట్టాడు.

ఆవేళ క్యాంపునుండి రావడం కొంచె మాలస్యమైంది. భోజనంచేసి కాస్సేపు కుర్చీలో నడుంవాల్చాడు. అంతే ఇంతట్లోకే రోదనధ్వనులు వినిపించా యెక్కడ నుంచో! అప్పుడు పదిగంటలు దాటుతుం

దేమో. ఇంత రాత్రివేళ యెవరేడుస్తున్నారాలని వీధిలోకి వెళ్లి కాస్సేపు వినేటప్పటికి ధ్వని రెండు మూడిళ్లవతలనుంచి వస్తున్నట్లనిపించింది. వెళ్లి చూసేటప్పటికాయేడుపు రిటైర్డు డిప్టీకలక్టరు వెంకట్రావుగారింట్లోంచి అని తేలింది.

సంగతి తెల్సికోనేందుకు లోపలికి వెళ్లాడు. ఇంకా నలుగురైదుగురు వచ్చారు చుట్టు ప్రక్కల వాళ్ళు. వెంకట్రావుగారల్లుడు గుండెజబ్బుచే మరణించాడని టెలిగ్రాము వచ్చిందట! ఆశ్చర్యపోయాడు రామారావు. పెళ్ళై యింకా నెలరోజులు కాలేదు, ఇంతట్లోకే యింతప్రమాదం జరిగింది. వెంకట్రావుగారి కుటుంబానికి తన సంతాపాన్ని తెలియజేసాడు. వారి కుటుంబాన్ని విచారించవద్దనీ, విచారించడం వ్యర్థమనీ నాలుగు సానుభూతి వాక్యాలు పలికి యింటికి వెళ్ళిపోయాడు. ఎవరైనా అంతకంటె యింకేం చెయ్యగలరు?

అప్పటినుండి తనకు తీరుబడైనప్పుడల్లా వెంకట్రావుగారింటికెళ్ళి వాళ్ళని ఊరడిస్తుండేవాడు. వెంకట్రావుగారాధునిక సాంప్రదాయానికి చెందిన వారవడంచేత ఆయన కుమార్తె "కమల"కు కేశఖండనము మాత్రము చేయించలేదు. పాపం పెద్దకట్నమిచ్చి ఉన్న ఒక్కకుమార్తెకు వివాహంచేసారు. కాని విధివ్రాత వేరైంది. కమలను చూస్తే ఆదంపతుల కడుపు తరుక్కుపోతోంది. కానిఏంచేయగలరు! మరల వివాహం చేయడం సాధ్యమా? వివాహమాడేదెవరు? ఇత్యాది ప్రశ్నలు వారినెదుర్కొనేవి.

రామారావు వెళ్లినపుడెల్లా వెంకట్రావుగారితో నేటి సంఘంలోని వితంతువుల పరిస్థితులు, వీరినుద్ధరించుటకు పంతులుగారు పడ్డశ్రమ మొదలైన విషయాలు చర్చించేవాడు. ఆయనకూడ తనకుమార్తె విషయమై మిక్కిలి విచారించేవాడు.

ఒక ఆదివారంనాడు వాళ్ళింటికెళ్ళాడు రామారావు. ఆ వేళ వెంకట్రావుగారెక్కడికో పనిమీద వెళ్ళారు. ఆయన లేరని చెప్పడానికి గుమ్మంలోకి వచ్చినపుడు కమలను చూసాడు. అంతక్రితం మెప్పుడూ ఆమె నంత తీరిగ్గా చూడలేదతను. ఆమె ముఖంమీద బొట్టులేక పోవడ మామె అందానికే లోటనిపించిందతనికి. తిరిగి వెళ్ళి పోయేటప్పుడతనికి తను వితంతు వివాహమాడుటకు చేసికొన్న నిశ్చయము జ్ఞప్తికొచ్చింది. కమలనే వివాహం చేసికొంటేయేమి? అనే ప్రశ్నతట్టింది. కాని వెంకట్రావుగారొప్పుకుంటారో లేదో! అయినా మర్నాడామె వివాహ విషయమాయనతో మాట్లాడ దల్చుకున్నాడు.

అనుకున్నట్లే చేసాడు. మాటల సందర్భంలో "కమలకు మరల వివాహం చేస్తేనో?" అన్నాడు రామారావు

వెంకట్రావుగారితో. ఆయన నిరుత్సాహంతో "చేసికొనే వారెవరు నాయనా?" అన్నారు.

"మీకిష్టమైతే నేనే చేసుకుంటా" నన్నాడు రామారావు సమాధానం కోసం యెదురు చూస్తూ.

వెంకట్రావుగారుప్పొంగి పోయారు. "నిజమేనా?" అన్నారు గట్టిగా సందేహం తీర్చుకొనేందుకు. అతని నిశ్చయం తెలిసికొన్న వెంకట్రావుగారంతులేని ఆనందంతో మునిగి పోయారు. లోనికి వెళ్లి భార్యతోను కుమార్తెతోను శుభవార్త చెప్పారు. ఇక ఆ కుటుంబం యొక్క ఆనందం చెప్పే దేముంది?

ముహూర్తం త్వరలోనే పెట్టించి వివాహం చేసారతివైభవంగా వెంకట్రావుగారు. మర్నాడే పత్రికలలో పడింది "కమలా రామారావుల ఆదర్శ వివాహం" గురించి. రామారావు తన ఆదర్శం సిద్ధించిందని, తను కొంచెమైనా సంఘసేవ చేయగలిగానని ఎంతో సంతోషించాడు. మిత్రులంతా అతన్నెక్కువగా అభినందించారు.

